క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాకేంద్రంలోని అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో 5 నుంచి 8వ తరగతిలో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ధమ్మయ్య ఓ ప్రకటనలో తెలిపారు. అనాథ బాలబాలికలు, మధ్యలో బడిమానేసిన (డ్రాపౌట్) విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. వివరాలకు 9494306758, 9963256758 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

బీజేపీ మండల కార్యవర్గం ఎన్నిక


ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

లింగాపూర్: మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో పార్టీ మండల కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. మండల ఉపాధ్యక్షులుగా జాదవ్ హిరామన్, అనితాబాయి, రాహుల్, హనుమంతు, జనరల్ సెక్రటరీలుగా ఆడే అశ్విన్, జాదవ్ సచిన్, సెక్రటరీలుగా జాదవ్ నరేశ్, లచ్చు, గంగాదేవి, పాపాబాయి, ట్రెజరీగా ఆత్రం సుదర్శన్ ఎన్నికైనట్లు మండల అధ్యక్షుడు ఆడే సురేశ్‌నాయక్ తెలిపారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం


కౌటాల: మొక్కలు నాటుతున్న బీజేపీ నాయకులు

కౌటాల: బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమని బీజేపీ మండల అధ్యక్షుడు కుంచాల విజయ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో బీజేపీ ముఖ్యకార్యకర్తల మండల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత 11ఏళ్లుగా నరేంద్రమోదీ ప్రభుత్వం దేశ ప్రజలకు సంక్షేమ పథకాలు అందజేస్తుందని తెలిపారు. బీజేపీతో దేశ రక్షణ సాధ్యమన్నారు. ప్రతీ కార్యకర్తకు అండగా ఉంటామని, పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలని తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పని చేయాలన్నారు. అనంతరం మొక్కలు నాటారు. సమావేశంలో బీజేపీ జిల్లా కార్యదర్శి బండి రాజేందర్‌గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి మధుకర్, నాయకులు భూమయ్య, రవీందర్, తిరుపతి, సంపత్, శ్రీనివాస్, వెంకటేశ్, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు

బెజ్జూర్: అర్హులైన పేద ప్రజలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని ఎంపీడీవో బండారి ప్రవీణ్ కుమార్ అన్నారు. మండలంలోని చిన్న సిద్దాపూర్ గ్రామంలో 16 మందికి ప్రభుత్వం ఇండ్లు మంజూరు చేయగా, శుక్రవారం ముగ్గు వేసి పనులు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి పేద కుటుంబానికి ఇంటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో ముందుకెళ్తుందని తెలిపారు. ఇల్లు లేని వారందరికీ న్యాయంగా ఎంపిక చేసి ఇళ్లు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. కార్యదర్శులు తుకారాం, వైకుంఠం, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన ఎమ్మెల్యే


ఎస్పీకి పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి, నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: ఇటీవల ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన పాటిల్ కాంతిలాల్ సుభాష్‌ను శుక్రవారం ప్రజాప్రతినిధులు, అధికారులు మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. వీరిలో నాయకులు అలీబిన్ అహ్మద్, జాబరి రవీందర్, పోచయ్య, నాయకులు, కార్యకర్తలున్నారు. అలాగే ఎస్పీని జిల్లా అటవీశాఖ అధికారి నీరజ్ కుమార్ టిబ్రివాల్ మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించా రు. జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి అజ్మీరా శ్యాంనాయక్ ఎస్పీని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. నాయకులు నిజాం, జక్కన్న, బాలు, వెంకటేశ్ తదితరులున్నారు.

పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్య

ఆసిఫాబాద్‌రూరల్: పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం మండలంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని మాలన్‌గొంది గ్రామానికి చెందిన భీంబాయి (19) భర్త భీముతో పాటు కుటుంబ సభ్యులు అదే గ్రామంలో పెళ్లికి వెళ్లగా ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు గమనించి జిల్లా కేంద్రంలోని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. ఆమెకు వారం క్రితమే భీముతో వివాహం జరిగింది. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

సూర్యాస్తమయం.. ప్రాణహితం


సంధ్యా సమయంలో..


అస్తమిస్తున్న భానుడి ప్రతిబింబం


ప్రకృతి అందాలతో అలరించే నదీ తీరం

చింతలమానెపల్లి: ప్రాణహిత నది తీరం సహజ అందాలకు పుట్టినిల్లు. ప్రకృతి అందాలకు కొదువ లేదు. తుమ్మిడిహెట్టి వద్ద మొదలై కాళేశ్వరం వద్ద గోదావరిలో సంగమించే ప్రాణహిత నది తీరం వెంట అడవులు, నదిలో విస్తరించి ఉన్న ఇసుక తిన్నెలు, పంట భూములు చూపరుల మదిని దోచుకుంటాయి. సూర్యోదయ, సూర్యాస్తయ వేళల్లో ఈ అందాలు రెట్టింపవుతాయి. ప్రాణహిత నదితీరంలో సమయం గడుపుతూ ఆస్వాదించే వారికి నయనానందాన్ని కలిగిస్తాయి. తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దులో తలాయి, మురళిగూడ, మహారాష్ట్ర సరిహద్దులోని దేవలమర్రి వద్ద 'సాక్షి' క్లిక్‌మనిపించిన చిత్రాలివి.

బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి


మాట్లాడుతున్న జిల్లా కోఆర్డినేటర్ మధుకర్


పెంచికల్‌పేట్ ఉన్నత పాఠశాలలో..


కాగజ్‌నగర్‌టౌన్: బడిబాట కార్యక్రమంలో ..


దహెగాం: ఇట్యాలలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

దహెగాం: బడీడు పిల్లలను పనిలో పెట్టుకోకుండా వారిని బడికి పంపించాలని ఎంఈవో శ్రీనివాస్ అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో బడిబాట ర్యాలీ, గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతు గ్రామాల్లో బడీడు పిల్లలను గుర్తించి సమీపంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌టౌన్: బడిబయట ఉన్న బడీడు పిల్లలందరిని సర్కారు బడుల్లో చేర్పించాలనే నినాదంతో శుక్రవారం కాగజ్‌నగర్ మండలంతోపాటు పట్టణంలో బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. జెడ్పీఎస్ఎస్ పెట్రోల్ పంప్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల (ఓల్డ్), జెడ్పీఎస్ఎస్ సర్‌సిల్క్, ఆర్ఆర్‌వో కాలనీలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (న్యూ) ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పట్టణంలోని ఆయా కాలనీల్లో తిరుగుతూ ప్రభుత్వ బడుల్లో ఉన్న సౌకర్యాలను వివరించారు. నాణ్యమైన బోధన, ఉచిత పుస్తకాలు, ఉచిత మధ్యాహ్న భోజనం తదితర సౌకర్యాలు ఉంటాయని తెలిపారు. ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు జాడి కేశవ్, ఉపాధ్యాయులు మామిడాల తిరుపతయ్య, ఎస్.హనుమంత్‌రావు, ఎస్. చక్రపాణి, ప్రైమరీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చిన్ను, ఆర్. శ్రీకాంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదుకు కృషి చేయాలని పెంచికల్‌పేట్ ఉన్నత పాఠశాల హెచ్ఎం విజయ నిర్మల అన్నారు. శుక్రవారం ఆచార్య జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా గ్రామసభ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడానికి గ్రామాల్లోని టీచర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఐకేపీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, గ్రామస్తులు సహకరించాలన్నారు. సమావేశంలో ఉపాధ్యాయులు, పోషకులు తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌రూరల్: బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని జిల్లా కోఆర్డినేటర్ కటుకం మధుకర్ అన్నారు. ఈ సందర్భంగా మండలంలోని వంజీరి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో బడిబాట కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమ్యూనిటీ మొబలైజింగ్ అధికారి, జిల్లా కోఆర్డినేటర్ కటుకం మధుకర్ మాట్లాడుతూ ఐదు సంవత్సరాలు నిండిన ప్రతీ పిల్లవాడిని ప్రభుత్వ పాఠశాలలోనే చేరేలా ప్రతీ ఒక్కరూ కృషి చేయాలన్నారు. బడికి దూరంగా ఉన్న బడి మనేసిన వారిని తిరిగి పాఠశాలలో చేర్పించే బాధ్యత ప్రతీ ఒక్కరికి ఉందన్నారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి పృథ్వీరాజ్, పాఠశాల కమిటీ చైర్మన్ పద్మ, పంచాయతీ కార్యదర్శి శ్వేత, ఉపాధ్యాయులు, హరీఫ్, సుశీల దేవి, శివానంద్, అంగన్వాడీ టీచర్లు వెంకటలక్ష్మి, సక్కుబాయి, కమల, గ్రామస్తులు నానయ్య, రావుజీ, బాబాజీ, తిరుపతి, కార్తీక్, కాంతారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

బెజ్జూర్: బడీడు పిల్లలు బడిలో ఉండాలని తహసీల్దార్ రాంమోహన్ అన్నారు. శుక్రవారం మండలంలోని చిన్నసిద్దాపూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బడీడు పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకోవాలని తెలిపారు. ఉదయ్ కిరణ్, పంచాయితీ కార్యదర్శి తుకారాం, ఉపాధ్యాయులు మహేశ్వరి, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

వాంకిడి: బడిబాటలో భాగంగా మండల కేంద్రంలో గ్రామసభ నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి హనుమాన్ మందిర్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. బడిబాటలో నిర్వహించే రోజూ వారి కార్యక్రమాలను ఎంఈవో శివచరణ్ కుమార్ ప్రజలకు వివరించారు. అనంతరం ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రతీ రోజు షెడ్యూల్ ప్రకారం బడిబాట నిర్వహించి ప్రభుత్వ బడుల బలోపేతం కోసం కృషి చేయాలన్నారు. విద్యార్థుల నమోదు పెంచేలా అధికారులు, గ్రామ ప్రజలు కలిసికట్టుగా పని చేయాలని సూచించారు. ఉపాధ్యాయులు శ్రీనివాస్, సంతోష్, మమత, వినేష్, గిర్మాజి, సీఆర్పీలు దుర్గం సందీప్, సునీల్, విజయబాబు, ఐఆర్పీ తిరుమల, జీపీ కార్యదర్శి శివకుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కుమారి, లత, భారతి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌రూరల్: తుంపెల్లిలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో సుభాష్ మాట్లాడుతూ ఐదేళ్లు నిండిన బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


వాంకిడిలో..


మాట్లాడుతున్న తహసీల్దార్ రాంమోహన్

కౌటాలలో..

కౌటాల: బడీడు పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించాలని ఎంఈవో గావుడే హన్మంతు అన్నారు. జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని గుడ్లబోరి ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని, పాఠశాలలకు అన్ని వసతులు కల్పిస్తారని తెలిపారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో విద్య అందించేందుకు ప్రభుత్వం పాటు పడుతుందన్నారు. బడిబాట కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని, ఉపాధ్యాయులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

- బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఏసీఎంవో ఉద్ధవ్ అన్నారు. మండలంలోని మోవాడ్,వావుదాంలోని గిరిజన సంక్షేమ శాఖ పాఠశాలలో శుక్రవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఎస్‌సీఆర్పీ అనంత్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.
- కెరమెరి మండలంలోని గోయగాం, సవర ఖేడ్ గ్రామంలోని బడి బాట కార్యక్రమం నిర్వహించారు. ఎంఈవో ప్రకాశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రెబ్బెన: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచడంలో ఉపాధ్యాయులతోపాటు తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలని ఎంఈవో వెంకటేశ్వర్లు అన్నారు. బడిబాటలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శంకరమ్మ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.


కౌటాలలో..


రెబ్బెన: మాట్లాడుతున్న ఎంఈవో వెంకటేశ్వర్లు


అవగాహన కల్పిస్తున్న ఏజీఎంవో ఉద్ధవ్

సమ్మర్ క్యాంపులు సక్సెస్!


ఆసిఫాబాద్ మోడల్ స్కూల్ క్యాంపులో నెట్‌బాల్ ఆడుతున్న విద్యార్థులు (ఫైల్)

- జిల్లాలో పది శిబిరాలు ఏర్పాటు
- 35 రోజులపాటు నిర్వహణ
- 10 క్రీడాంశాల్లో విద్యార్థులకు శిక్షణ

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో వేసవి సెలవుల్లో యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మర్ క్యాంపులు శుక్రవారం ముగిశాయి. 35రోజుల పాటు 10 క్యాంపుల్లో 10 క్రీడాంశాల్లో శిక్షణ ఇచ్చారు. వేసవి సెలవుల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో క్రీడల్లో మెళకువలు నేర్పించారు. విద్యార్థులూ ఉల్లాసంగా శిక్షణకు హాజరయ్యారు. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించేందుకు సమ్మర్ క్యాంపులు ఎంతగానో ఉపయోగపడ్డట్లు విద్యార్థులు చెబుతున్నారు.

ఉల్లాసంగా సాగిన క్యాంపులు

జిల్లాలో ఏర్పాటు చేసిన 10 క్యాంపుల ద్వారా బాలబాలికలకు వివిధ క్రీడాంశాల్లో 10 మంది శిక్షణ ఇచ్చారు. జిల్లాలోని ఆసిఫాబాద్‌లో జన్కాపూర్, రాజంపేట్, బూర్గుడ.. తిర్యాణిలో రోంపల్లి, తిర్యాణి, రాళ్ల కొంపల్లి.. కాగజ్‌నగర్‌లో బూర్దగూడ, సారంగి, వెంపల్లి, నజ్రుల్‌నగర్‌లో శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈసారి గ్రామీణ విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యం పెంచాలనే ఉద్దేశంతో గ్రామీణ ప్రాంతంలోనే క్యాంపులు ఏర్పాటు చేశారు.

బేసిక్ రూల్స్ నేర్చుకున్న



ఆసిఫాబాద్ మోడల్ స్కూల్‌లో నిర్వహించిన సమ్మర్ క్యాంప్‌లో కోచ్ తిరుపతి నెట్‌బాల్‌పై బేసిక్ రూల్స్ నేర్పారు. ఇటీవల నెట్‌బాల్ పోటీల్లో రాష్ట్రస్థాయిలో కాంస్య పతకం సాధించాను. జాతీయస్థాయిలో గెలవాలనేదే నా లక్ష్యం.
– బొట్టుపల్లి సాయిదీక్ష, మోతుగూడ

క్యాంపు ఉపయోగపడింది



వేసవి సెలవుల్లో ఆసిఫాబాద్ మోడల్ స్కూల్‌లో నిర్వహించిన సమ్మర్ క్యాంపు మాకు ఎంతో ఉపయోగపడింది. నెట్‌బాల్ క్రీడలో చాలా మెళకువలు నేర్చుకున్న. గతంలో నేషనల్ లెవెల్‌లో మన జిల్లా నుంచి పాల్గొన్నాను.
– పులగం అర్చన, మోడల్ స్కూల్, ఆసిఫాబాద్

మెళకువలు నేర్చుకున్న



రాజంపేట్ మోడల్ స్కూల్‌లో నిర్వహించిన సమ్మర్ క్యాంపులో హ్యాండ్‌బాల్ క్రీడలో కొత్త మెళకువలు నేర్చుకున్నాను. క్రీడా కోటలో మంచి ఉద్యోగం సాధించాలని ఉంది. నా లక్ష్యం ఆర్మీలో ఉద్యోగం చేయాలని ఉంది.
– అనిత, మోడల్ స్కూల్, రాజంపేట

క్రీడలూ అవసరమే..

విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలూ చాలా అవసరం మానసికోల్లాసం, ఆరోగ్యంగా ఉండేందుకు క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయి. యువజన క్రీడలశాఖ ఆధ్వర్యంలో జిల్లాల్లో 10 సమ్మర్ క్యాంపులు నిర్వహించి ఉచిత శిక్షణ ఇచ్చాం.
– మీనారెడ్డి, డీఎస్వో

రోస్టర్ ప్రకారమే పదోన్నతులు


అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న సభ్యులు

రెబ్బెన: సింగరేణిలో పనిచేస్తున్న ఎస్టీ ఉద్యోగులకు రోస్టర్ ప్రకారమే పదోన్నతులు కల్పిస్తామని బెల్లంపల్లి ఏరియా జీఎం విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. ఎస్టీ రోస్టర్ రిజిస్టర్ వెరిఫికేషన్ కార్పొరేట్ కమిటీ సభ్యులు శుక్రవారం బెల్లంపల్లి ఏరియాలో పర్యటించారు. కమిటీ సభ్యులను ఏరియా జీఎం గోలేటి టౌన్‌షిప్ లోని జీఎం కార్యాలయంలో స్వాగతం పలికారు. అనంతరం కమిటీ సభ్యులు ఏరియాలో పనిచేస్తున్న ఎస్టీ ఉద్యోగుల రోస్టర్ రికార్డులను కార్పొరేట్ చీఫ్ లైసెన్ అధికారి కృష్ణయ్య తనిఖీ చేశారు. ఎస్టీ ఉద్యోగాల ఖాళీల భర్తీ పదోన్నతులకు సంబంధించిన రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం జీఎం కార్యాలయ ఆవరణలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళిర్పించారు. ఈ సందర్భంగా ఏరియా జీఎం ఏరియా అన్ని పదోన్నతులు రోస్టర్ ప్రకారమే జరుగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఎస్వోటూ జీఎం రాజమల్లు, కమిటీ సభ్యులు ప్రెసిడెంట్ ఎ.భాస్కర్‌రావు, ప్రధాన కార్యదర్శి నాగేశ్వర్‌రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ పంతులు, ఏరియా లైసెన్ అధికారి శ్రీరాములు, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, డీజీఎం ఉజ్వల్‌కుమార్ బెహెరా, సీనియర్ పర్సనల్ అధికారి శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్ అర్చన తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న అధికారికి సన్మానం


రవిని సన్మానిస్తున్న జీఎం విజయ భాస్కర్‌రెడ్డి

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియాలో క్వాలిటీ డిపార్టుమెంట్ అధిపతిగా పని చేసిన గుమాస రవి కొత్తగూడెంలోని కార్పొరేట్ క్వాలిటీ విభాగానికి బదిలీపై వెళ్తున్న సందర్భంగా శుక్రవారం సాయంత్రం ఏరియా జీఎం విజయభాస్కర్‌రెడ్డి సన్మానించారు. గోలేటిలోని జీఎం కార్యాలయంలో అన్ని విభాగాల అధికారులు ఆయనకు పూలమాలలు వేసి సత్కరించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ బెల్లంపల్లి ఏరియాలో క్వాలిటీ విభాగానికి గూమాస రవి అందించిన సేవలను కొనియాడారు. నాణ్యమైన బొగ్గును వినియోగదారులకు అందించడంలో క్వాలిటీ అధిపతిగా మంచి పేరు సాధించారన్నారు. ఎస్వోటూ జీఎం రాజమల్లు, ఏరియా ఇంజనీర్ రామనాథం, డీజీఎం సెక్యూరిటీ ఉమాకాంత్, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి పాల్గొన్నారు.

పేరుకుపోయిన చెత్త..!


పీహెచ్‌సీ ఆవరణలో చెత్త సంచులు


ప్రసూతి వార్డు పక్కనే చెత్తాచెదారం

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆవరణలో చెత్త పేరుకుపోయి నెలలు గడుస్తున్నా తరలించేందుకు చర్యలు తీసుకోవడం లేదని ఆసుపత్రికి వచ్చే రోగులు వాపోతున్నారు. ఆసుపత్రి ప్రసూతి వార్డు గోడ పక్కనే వ్యర్థాలు పడేయడంతో కిటికీల్లోంచి దుర్గంధం వెదజల్లుతుందని బాలింతలు వాపోతున్నారు. ఆసుపత్రిలో వినియోగించిన మందులు, ఇంజక్షన్లు, ప్లాస్టిక్ వ్యర్థాలు సంచుల్లో నింపి నెలలు గడుస్తున్నా వాటిని తరలించకుండా ఆసుపత్రి చుట్టూ ఉంచడంతో దుర్వాసన వస్తుందని వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఆసుపత్రి ఆవరణ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.